సాక్షి
ములుగు
మంగళవారం | 7 | మార్చి | 2023



కేటీఆర్ సభకు తరలించాలి

మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని తొర్రూరులో నిర్వహించే మంత్రి కేటీఆర్ సభకు భారీ సంఖ్యలో మహిళలను తరలించాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. - 8లో▸



గంజాయి విక్రయదారుల అరెస్ట్

వరంగల్ బస్టాండ్ సమీపంలో గంజాయి విక్రయదారులు నలుగురిని అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్‌రెడ్డి తెలిపారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
36.0° /20.0°

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పొగమంచుతో కూడిన ఎండ ఉంటుంది. వాతావరణం వేడిగా ఉంటుంది. రాత్రిపూట చలిగా ఉంటుంది.

హోలీ జరుపుకుంటున్న చిన్నారులు



కాముడి వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న మార్వాడీలు, గ్రామస్తులు



కాముడి దహనం చేస్తున్న మార్వాడీలు



కాముడి దహనం

ఏటూరునాగారం మండల కేంద్రంలోని రామాలయం సెంటర్‌లో మార్వాడి షాపుల యజమానులు, ఇతర సంఘాల నాయకులు సోమవారం రాత్రి కాముడి దహనం చేశారు. గడ్డి, పాలకర్ర, కొబ్బరికాయలు, కోలలను పేర్చి కాముడికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ పెద్ద వేణుగోపాల్ లాహోటి, పోగుల లక్ష్మినారాయణ ప్రత్యేక పూజలు చేసి ప్రజలకు తిలకం దిద్దారు. చుట్టూ నీళ్లు ఆరబోసి ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఆ తర్వాత చిన్నారులు, మార్వాడి మహిళలు రంగులు పూసుకొని కాముడి దహనం ఘనంగా చేపట్టారు.

- ఏటూరునాగారం

న్యూస్‌రీల్

రామప్పను సందర్శించిన అమెరికా దేశస్తులు



వెంకటాపురం(ఎం): మండలంలోని చారిత్రాత్మక రామప్ప దేవాలయాన్ని అమెరికాకు చెందిన జెన్నెట్, కింబర్లీ, జెనిస్, టీనా సోమవారం సందర్శించారు. రామలింగేశ్వర స్వామికి వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ విశిష్టత గురించి గైడ్ విజయ్‌కుమార్ వివరించగా రామప్ప ఆలయం అద్భుతంగా ఉందని కొనియాడారు.

ఎక్స్‌గ్రేషియా అందించాలి



ములుగు రూరల్: గోవిందరావుపేట మండలం చల్వాయి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థి రిశాంత్ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా అందించాలని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ బొట్ల కార్తీక్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా విద్యాశాఖ క్వాలిటీ కోఆర్డినేటర్ బద్దం సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులను సస్పెండ్ చేయాలని అన్నారు. రిశాంత్ కుటుంబానికి న్యాయం జరిగే వరకు బీఎస్పీ అండగా ఉంటుందని చెప్పారు. ప్రభుత్వం విద్యావ్యవస్థ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నరేష్, ముఖేష్, అజయ్‌కుమార్, ప్రవీణ్, దుర్గ పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై తనిఖీలు



వాజేడు: మండల పరిధిలోని చంద్రుపట్ల గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై పేరూరు ఎస్సై రుద్రారపు హరీశ్ ఆధ్వర్యంలో సివిల్, సీఆర్‌పీఎఫ్ పోలీసులు సోమవారం వాహన తనిఖీలు నిర్వహించారు. ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణకు వచ్చే ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయడంతో పాటు ప్రయాణికుల బ్యాగులను సోదాలు చేశారు. ప్రయాణికుల గుర్తింపు కార్డులను పరిశీలించి ఎక్కడి నుంచి వస్తున్నారు.. ఎక్కడికి వెళ్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ప్రతీ వాహనాన్ని నిశితంగా పరిశీలించారు.

ఎన్‌హెచ్‌ఆర్‌సీ రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా రాజు

వెంకటాపురం(ఎం): జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) రాష్ట్ర కార్యదర్శిగా మండలంలోని పాపయ్యపల్లి గ్రామానికి చెందిన ఎలకంటి రాజును నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు మొగుళ్ల భద్రయ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా మండలంలోని లక్ష్మీదేవిపేట గ్రామానికి చెందిన పోలోజు రామ్మూర్తిని నియమించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎన్‌హెచ్‌ఆర్‌సీ జాతీయ చైర్మన్ మహ్మద్ యాసీన్, రాష్ట్ర అధ్యక్షుడు భద్రయ్యకు రాజు, రామ్మూర్తి కృతజ్ఞతలు తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



భూపాలపల్లి అర్బన్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా యూత్ అండ్ స్పోర్ట్స్ అధికారిని బుర్ర సునిత తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం భూపాలపల్లి డిపో ఆవరణలో బస్‌స్టేషన్‌లో ప్రయాణికుల మధ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథులుగా జిల్లా యూత్, స్పోర్ట్స్ అధికారిని బుర్ర సునిత, స్థానిక వైద్య నిపుణురాలు డాక్టర్ ప్రసన్నలక్ష్మి హాజరయ్యారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉత్తమ ఉద్యోగులతో పాటు వివిధ ఆటల పోటీల్లో పాల్గొని విజేతలైన కార్మికులకు బహుమతులు అందజేశారు. ఆర్టీసీ బస్సులలో నిత్యం ప్రయాణం చేసే ప్రయాణికులను సైతం సత్కరించారు.

చూపు తగ్గుతోంది..

దెబ్బతింటున్న కంటిచూపు



- దుమ్ముధూళి కణాలతో ముప్పు
- 'కంటి వెలుగు' పరీక్షల్లో నిర్ధారణ
- నిర్లక్ష్యం చేస్తే ముప్పు తప్పదంటున్న వైద్య నిపుణులు
- జాగ్రత్తలు తీసుకోవాలని సూచన

భూపాలపల్లి అర్బన్: దుమ్ము ధూళి కణాల మధ్య తిరగడం.. కంటి అద్దాలు, హెల్మెట్ లేకుండా బైక్‌లపై కిలోమీటర్ల కొద్దీ ప్రయాణించడం.. హార్మోనల్ ఇన్ బ్యాలెన్స్.. ఇన్‌ఫెక్షన్లు.. తరచూ సూర్యుడి వైపు చూడటం.. వెరసి కంటి చూపును దెబ్బతీస్తున్నాయి. వైద్య పరిభాషలో 'టెరిజియం/సర్ఫస్ ఐ'గా చెప్పుకునే (కంట్లో కండరాల పెరుగుదల) సమస్యకు కారణమవుతున్నాయి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా రెండు నెలల నుంచి జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న స్కీనింగ్స్‌లో ఇవే అంశాలు వెల్లడయ్యాయి. ముఖ్యంగా 25–40 ఏళ్ల వయస్సులో ఈ సమస్య ఎక్కువగా ఉన్నట్లు వెల్లడైంది. చికిత్సను నిర్లక్ష్యం చేస్తే ఆ కండరాలు కార్నియాను పూర్తిగా కప్పేసి కంటిచూపును దెబ్బతీసే ప్రమాదం లేకపోలేదని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

35,584వేల మందికి చూపు సమస్యలు

కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా జనవరి 19నుంచి ఈనెల 3వ తేదీ వరకు జిల్లాలో 13 ఆరోగ్య కేంద్రాల పరిధిలో 25 క్యాంపుల ద్వారా నేత్ర పరీక్షలు చేస్తున్నారు. ఇప్పటివరకు 1.06 లక్షలమందికి కంటి పరీక్షలు నిర్వహించగా వీరిలో 35,584వేల మందికి కంటిచూపు సమస్యలు ఉన్నట్లు నిర్ధారణ అయింది. ఇప్పటివరకు 20,590మందికి రీడింగ్ గ్లాసులు పంపిణీ చేయగా ఇంకా 14,994 మందికి ప్రిస్కిప్షన్ గ్లాసులు సిఫార్సు చేశారు. ఆయా బాధితులకు కంటి అద్దాలు ఇంకా అందాల్సి ఉంది. కంటి జబ్బులు నిర్ధారణ అయిన బాధితుల్లో 0.5శాతం మంది కంట్లో కండరాల సమస్యతో బాధపడుతున్నట్లు గుర్తించారు. కార్నియాపై తెల్లని కండరాలు పేరుకుపోవడంతో కంటిచూపు దెబ్బతింటుంది. ఈ సర్ఫస్ ఐ బాధితుల్లో దుమ్ముధూళి కణాలు ఎక్కువగా ఉండే రద్దీ ప్రాంతాల్లో ప్రయాణించే యువతీ, యువకులే ఎక్కువ శాతం ఉండటం విశేషం. వైద్యులు వీరికి సర్జరీ సిఫార్సు చేయడం గమనార్హం.



కంటి పరీక్షలు చేస్తున్న సిబ్బంది

కంటి వెలుగు క్యాంపులు: 25
పరీక్షలు చేయించుకున్నవారు : 1,06,042
రీడింగ్ గ్లాసుల పంపిణీ : 20,590
ప్రిస్కిప్షన్ గ్లాసులు అవసరమైన వారు: 14,994
సర్ఫస్‌ఐ బాధితులు: 5 నుంచి 6 శాతం

జాగ్రత్తలు తీసుకోవాలి..



సూర్యుని కిరణాల వైపు తదేకంగా చూసే వారు. రోడ్డు ప్రయాణికులు, వెల్డింగ్, సిమెంట్ పనిచేసే కార్మికులు, బొగ్గు గనులు, విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, ప్లాస్టిక్ కంపెనీలు, ఇతర కంపెనీల్లో పనిచేసే ఉద్యోగులు, కూలీలు ఎక్కువగా టెరిజియం బారినపడుతున్నారు. ఇటీవల కాలంలో ఈ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. కంట్లో మట్టి, ఇసుక, నలుసు, బుడిద పడకుండా జాగ్రత్త వహించాలి. కంప్యూటర్, టీవీ, ఫోన్ వంటి వాటికి సాధ్యమైనంత వరకు దూరంగా ఉండాలి. కంటినిండా నిద్రపోవాలి. తరచూ చన్నీళ్లతో కళ్లను శుభ్రం చేసుకోవడం ద్వారా ఇన్‌ఫెక్షన్ల బారినపడకుండా కాపాడుకోవచ్చు. లేదంటే కంటి దురద వంటి సమస్యలు తలెత్తుతాయి. నిర్లక్ష్యం చేస్తే చూపును శాశ్వతంగా కోల్పోయే ప్రమాదం ఉంది.

- డాక్టర్ శ్రీరామ్, ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ

పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు..



దరఖాస్తును పరిశీలిస్తున్న కలెక్టర్

కలెక్టర్ కృష్ణ ఆదిత్య

ములుగు: గ్రీవెన్స్ దరఖాస్తుల విషయంలో నిర్లక్ష్యం చేయకుండా సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ కృష్ణ ఆదిత్య అధికారులను ఆదేశించారు. జిల్లాకేంద్రంలోని సమావేశ మందిరంలో సోమవారం గ్రీవెన్స్ డేలో భాగంగా అదనపు కలెక్టర్(రెవెన్యూ) వైవీ గణేశ్, అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) ఇలా త్రిపాఠిలతో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి వాటిని పరిశీలించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 33దరఖాస్తులు రాగా అందులో 14 భూ సమస్యలు, 19 ఇతర దరఖాస్తులు ఉన్నాయి. వాటిని సంబంధిత అధికారులకు అందించారు. అనంతరం అధికారులతో జరిగిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో ఆలస్యం చేయకుండా వేగం పెంచాలని సూచించారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని ప్రజలకు నీటి సమస్యలు రాకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. ప్రతి ఇంటికీ నీటిని అందించాలని అన్నారు. మండల ప్రత్యేక అధికారులు జెడ్పీ పాఠశాలలను సందర్శించి పదో తరగతి విద్యార్థుల్లో మనోధైర్యాన్ని పెంచాలని అన్నారు. కంటి వెలుగు ద్వారా అద్దాల పంపిణీలో జాప్యం జరగకుండా చూడాలని చెప్పారు. ఈ సమావేశంలో డీఆర్వో కూతాటి రమాదేవి, డీఆర్డీఓ నాగపద్మజ, సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్, డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్య, డీపీఓ కొండా వెంకయ్య, సీపీఓ ప్రకాశ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ మాణిక్యరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, డీఈఓ సర్దార్‌సింగ్, డీవైహెచ్‌ఓ విజయభాస్కర్, ఎస్సీ వెల్ఫేర్ అధికారి భాగ్యలక్ష్మి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

ములుగు: 15నుంచి ప్రారంభంకానున్న ఇంటర్మీడియేట్ వార్షిక పరీక్షలకు జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్(రెవెన్యూ) వైవీ గణేష్ సూచించారు. తన చాంబర్‌లో సోమవారం పరీక్షల కో ఆర్డినేటర్లతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. అధికారులు సమన్వయంగా మెలగాలని అన్నారు. పరీక్షలు జరిగే సమయాల్లో నిబంధనలు పాటించాలని చెప్పారు. ప్రశ్నాపత్రాల నిలవ్లకు పోలీస్‌స్టేషన్‌లో తగిన ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు. కేంద్రాల చుట్టూ 144 సెక్షన్ ఉంటుందని, జిరాక్స్ సెంటర్లు, ఇతర దుకాణాలకు అనుమతి ఉండదని అన్నారు. పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించాలని అన్నారు. వైద్యశాఖ తరఫున పరీక్ష కేంద్రాల్లో ప్రథమ చికిత్స కిట్‌తో పాటు మందుబిళ్లలు అందుబాటులో ఉంచాలని చెప్పారు.



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

విద్యుత్ అంతరాయం లేకుండా లైన్లను ముందుగానే సరిచూసుకోవాలన్నారు. తాగునీరు, వెలుతురు, మరుగుదొడ్ల వంటి సౌకర్యాలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో డీఐఈఓ వెంకటేశ్వర్లు, సీఐ రవీందర్, విద్యుత్‌శాఖ డీఈ నారాయణరావు, పోస్టల్ ఇన్‌స్పెక్టర్ రాంమూర్తి, ఆర్టీసీ అధికారి శంకర్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విపిన్, డీపీఆర్‌ఓ రఫీక్ పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

అదనపు కలెక్టర్ ఇలా త్రిపాఠి

వెంకటాపురం(ఎం): కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం మండలంలోని నర్సాపూర్ గ్రామంలో డీఎంహెచ్‌ఓ అప్పయ్య, జెడ్పీటీసీ రుద్రమదేవితో కలిసి కంటి వెలుగు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆశ కార్యకర్తలు గ్రామంలోని ఇంటింటినీ సందర్శించి ప్రజలకు కంటి వెలుగు కార్యక్రమంపై అవగాహన కల్పించాలని అన్నారు. దృష్టిలోపం ఉన్న వారికి ప్రతిరోజు రీడింగ్ గ్లాసెస్ వెంటనే ఇచ్చి ఆన్‌లైన్ చేయాలని సూచించారు.



కంటి వెలుగును ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్

ప్రిస్కిప్షన్ గ్లాసెస్ కూడా వీలైనంత తొందరగా పంపిణీ చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి రుషిత, సర్పంచ్ భద్రయ్య, ఎంపీటీసీ గోపు స్వప్న, ఉప సర్పంచ్ సాదు రాజు పాల్గొన్నారు.

మూఢనమ్మకాలను విశ్వసించొద్దు

ఎస్పీ గాష్ ఆలం

ములుగు రూరల్: ప్రజలు మూఢనమ్మకాలను విశ్వసించవద్దని ఎస్పీ గాష్ ఆలం అన్నారు. ఈ మేరకు సోమవారం మండలంలోని బంజరుపల్లిలో పోలీసుల ఆధ్వర్యంలో మూఢనమ్మకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామంలోని పలు కాలనీలను ఎస్పీ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగరిక సమాజంలో మూఢనమ్మకాలను నమ్మవద్దని ప్రజలకు చెప్పారు. సమస్యలు ఎదురైతే పోలీసులను ఆశ్రయించాలని అన్నారు. గ్రామంలో ఇటీవల జరిగిన ఘటన సరికాదన్నారు. గ్రామంలో యువత ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. యువత గ్రామంలో కమిటీగా ఏర్పడి ప్రజలను చైతన్యం చేయడంలో ముందుండాలని సూచించారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామంలో కొంతమంది అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు దృష్టికి వచ్చిందని.. వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఓఎస్‌డీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. అనారోగ్యం పాలైన వారు మూఢనమ్మకాలకు పోకుండా వైద్యం చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ మేకల రంజిత్, ఎస్సై ఓంకార్‌యాదవ్, సర్పంచ్ భద్రయ్య, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.



బంజరుపల్లిలో మాట్లాడుతున్న ఎస్పీ గాష్ ఆలం

వెండి కిరీటాల బహూకరణ

గణపురం: గణపురం మండలకేంద్రానికి చెందిన పాశికంటి సూరక్క–లింగయ్య దంపతుల కుమారుడు పాశికంటి రామకృష్ణ– భవాని దంపతులు రూ.16వేల విలువచేసే రెండు వెండి కిరీటాలను గణపేశ్వరాలయం శివపార్వతుల ఉత్సవమూర్తులకు సోమవారం బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు మునునూరి నరేష్‌కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామకృష్ణ దంపతులకు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించారు.



సమస్యల పరిష్కారంపై దృష్టిపెట్టాలి

ఐటీడీఏ పీఓ అంకిత్

ఏటూరునాగారం: సమస్యలను పరిష్కరించడంపై దృష్టిపెట్టాలని ఐటీడీఏ పీఓ అంకిత్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ఆవరణలో గిరిజన దర్బార్‌లో భాగంగా గిరిజనుల నుంచి వినతులను పీఓ స్వీకరించారు. 17మంది గిరిజనులు వివిధ సమస్యలపై పీఓకు వినతిపత్రాలు అందజేశారు. దరఖాస్తులను పరిశీలించి వారికి తగిన న్యాయం చేస్తామని పీఓ వెల్లడించారు. వినతులకు వెంటనే పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీసీసీ డీఎం ప్రతాప్‌రెడ్డి, పీహెచ్‌ఓ రమణ, హార్టికల్చర్ అధికారిణి భారతి, ఎస్‌ఓ రాజ్‌కుమార్, ఈఈ హేమలత, మేనేజర్ శ్రీనివాస్, ఆయా అధికారులు పాల్గొన్నారు.



గిరిజనుల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీఓ అంకిత్

దరఖాస్తుల్లో కొన్ని..

- తాడ్వాయి మండలం కొండపర్తి గ్రామంలో జీపీఎస్ పాఠశాలలో టీచర్‌ను నియమించాలని, గిరి వికాస్ పథకం లాగిన్ పీఓ ఆధ్వర్యంలోనే ఉండాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పులిశె బాలకృష్ణ పీఓకు అందజేశారు.
- మంగపేట మండలం శనిగకుంట గ్రామంలో రేషన్ బియ్యం రావడం లేదని పస్తులుండాల్సి వస్తోందని గిరిజనులు తాటిం నర్సింహరావు, వీరయ్య, తదితరులు విన్నవించారు.
- వెంకటాపురం(కె) మండలంలోని నూగూరులో ఇప్పపలుకులతో ఆహార పదార్థాలు తయారు చేయించేందుకు రుణాన్ని ఇప్పించాలని గిరిజన మహిళలు శ్రీదేవి, రాంబాయి. నాగమణి పీఓను కోరారు.
- అంగన్‌వాడీ ఉద్యోగులు, నర్సులను జీఓ నంబర్ 262 ప్రకారం రెగ్యులరైజ్ చేయాలని ఆదివాసీ టీచర్స్ ఫెడరేషన్ మహిపతి సంతోష్ కోరారు.
- ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ ద్వారా రుణాన్ని ఇప్పిస్తే బట్టలషాపు పెట్టుకొని జీవిస్తానని దుగ్గొండి మండలం మద్దునూరుకు చెందిన చిరంజీవి కోరారు.

హనుమంత వాహనసేవలో లక్ష్మీనరసింహస్వామి



టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని కోటంచ శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం హనుమంత వాహన సేవలో స్వామివారిని మాడ వీధుల గుండా ఊరేగించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం దోపోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్వామివారి నగలను పద్మశాలీలు అపహరించే ఘట్టంలో గజదొంగగా వెంగల శ్రీనివాస్ పూర్వీకుల నుంచి వచ్చిన సంప్రదాయాన్ని నిర్వహించారు.

ఆయుష్మాన్ భారత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

వెంకటాపురం(ఎం): కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్‌రెడ్డి కోరారు. ఆయుష్మాన్ భారత్ పథకంలో ప్రజలు తమ వివరాలను నమోదు చేసుకునేందుకు ఉచిత నమోదు కేంద్రాన్ని మండలకేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు భూక్య జవహర్‌లాల్ ఏర్పాటుచేయగా భాస్కర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ అనారోగ్యం బారిన పడిన పేదప్రజలు వైద్యం చేసుకునేందుకు డబ్బులు లేక ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. తెల్లరేషన్‌కార్డు కలిగిన ప్రతి కుటుంబానికీ ఆయుష్మాన్ భారత్ పథకం కింద దేశంలోని ఏ కార్పొరేట్ ఆస్పత్రిలోనైనా ఐదు లక్షల వరకు ఉచిత వైద్యాన్ని పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ సిరికొండ బలరాం, నాయకులు కారుపోతుల యాదగిరి, అల్లె శోభన్, శ్రీమంతుల రవీంద్రాచారి, పిట్టల శంకర్, రామిడి కర్ణాకర్‌రెడ్డి, సాంబరాజు కిరణ్, కన్నె బోయిన వీరేందర్, రమేష్, స్వామి, దేవేందర్, శ్రీశైలం, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆయుష్మాన్ భారత్ కేంద్రాన్ని, భాస్కర్‌రెడ్డి

హక్కుల సాధనకు పోరాటాలే శరణ్యం
వర్మి కంపోస్టు తయారీపై శ్రద్ధ చూపాలి
అన్ని హంగులతో వేడుకలు
ఒత్తిడి లేని విద్య అందించాలి
- 10లో▸

క్లుప్తంగా

సెల్‌ఫోన్ దొంగ పట్టివేత



ఎంజీఎం: ఎంజీఎం ఆస్పత్రిలో పిల్లల వార్డులో సోమవారం సెల్‌ఫోన్ దొంగలిస్తున్న ఓ వ్యక్తిని సెక్యూరిటీ గార్డులు పట్టుకుని మట్టెవాడ పోలీసులకు అప్పగించారు. వివరాల్లోకి వెళ్తే..ఆస్పత్రిలోని పిల్లల వార్డులో సోమవారం తెల్లవారు జామున ఓ వ్యక్తి సెల్‌ఫోన్ దొంగలిస్తున్నాడు. గమనించిన సెక్యూరిటీ సూపర్‌వైజర్ శ్రీనివాస, రమేశ్‌లు అతన్ని పట్టుకుని ఔట్ పోస్టు పోలీసులకు అప్పగించారు.

కేయూలో మెస్ బంద్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్శిటీలో అడ్మిషన్ల డైరెక్టరేట్‌లో పీజీ కోర్సుల విద్యార్థులకు మెస్ సౌకర్యం కల్పిస్తున్న విషయం విధితమే. కామన్‌మెస్‌లో మరమ్మతులు పూర్తికాగా అడ్మిషన్ల డైరెక్టరేట్ నుంచి సామాన్లు, ఫర్నీచర్‌ను కామన్‌మెస్‌లోకి తీసుకొస్తున్నామని అందుకు సోమవారం నుంచే మెస్ సదుపాయాన్ని యూనివర్శిటీ అధికారులు బంద్ చేశారు. అల్పాహారం కూడా పెట్టలేదు. రేపటి వరకు భోజనం కూడా బంద్ చేస్తారని, రాత్రి డిన్నర్ నుంచి రీఓపెన్ చేయనున్నట్లు సమాచారం. కేవలం అడ్మిషన్ల డైరెక్టరేట్ నుంచి కామన్‌మెస్‌కు సామాను షిఫ్టింగ్‌కు మూడు రోజుల పాటు మెస్ సౌకర్యం బంద్ చేయటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కామన్‌మెస్‌ను రీ ఓపెన్ చేయాలని విద్యార్థులు ఇటీవల ఆందోళన చేసిన విషయం విధితమే. కేయూ రిజిస్ట్రార్ శ్రీనివాసరావు కూడా ఇటీవల సందర్శించి త్వరలోనే రీ ఓపెన్ చేస్తామని ప్రకటించారు. సామాను షిఫ్టింగ్ పేరుతో మెస్ బంద్ చేయడంపై విమర్శలు వస్తున్నాయి.

రెడ్డి చికెన్ సెంటర్
Cell: 9989299661

WANTED TEACHERS
DIAMOND PUBLIC SCHOOL Invite Applications From Well Qualified and Minimum 3 Years Experienced with Excellent Communication Skills Candidates for all Subjects
Nursery to X Class
Maths · Physical Science · Biology · Social · Telugu · Hindi · English
Send Your Resume to dpsbheemaram2022@gmail.com
DPS DAY, SEMI & RESIDENTIAL NURSERY TO CLASS X
DIAMOND PUBLIC SCHOOL
BHEEMARAM, HANUMAKONDA. ✆ 91 600 89 882

రంగుల పండుగ వచ్చేసింది..



మోదుగు పూల చెట్టు



రంగుల అమ్మకాలు

- సహజ సిద్ధమైన రంగులే మేలు
- స్నానానికి చెరువులు, వాగులు, కుంటలకు సరదాకు వెళ్లి.. ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు

నేడు హోలీ

జనగామ: తెలుగు నెలల్లో చివరకి వచ్చే ఫాల్గుణ మాసం పౌర్ణమి రోజున హోలీ పండుగ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. చతుర్దశి నాడు కాముని దహనం నిర్వహించి మరుసటి రోజు రంగుల హోలీ జరుపుకుంటారు. దీపావళి తర్వాత దేశంలో అత్యంత వైభవంగా జరుపుకునే పండుగల్లో హోలీ ఒక్కటి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మంగళవారం హోలీ వేడుకలు జరుపుకోవడానికి ప్రజలు సిద్ధమవుతున్నారు. రంగులు చల్లుకోవడంతో పాటు గ్రామాల్లో ఉట్టి కొట్టే కార్యక్రమాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

సహజరంగులే మేలు

హోలీ వేడుకల్లో ప్రాణాంతక రసాయనాలు వాడకూడదు. వీటితో చర్మ సంబంధ వ్యాధులతో పాటు కంటి చూపు కోల్పోయే ప్రమాదం ఉంది. అందుకే సహజసిద్ధమైన గోరింటాకు పొడి, కుంకుమ, పసుపు, టమాటా గింజలు, మోదుకు పూల పొడితో తయారు చేసిన రంగులతో వేడుకలు జరుపుకోవాలని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.

జాగ్రత్తలు పాటిస్తే..

హోలీ సంబురాలు కుటుంబాల్లో విషాదం నింపకుండా చూసుకోవాలి. ఏటా జిల్లాలో ఏదో ఒక చోట చెరువులు, వాగులు, కుంటల వద్దకు స్నానానికి వెళ్లి నీటిలో మునిగిపోతున్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. చెరువులు, జలాశయాల వద్ద సెల్ఫీలు దిగడం.. సరదాలకు పోయి.. ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. కాస్త జాగ్రత్తలు పాటిస్తే.. పండుగలను సంతోషంగా మార్చుకోవచ్చు. ఈతకు వెళ్లేవారు చెరువులోతు ఎంత ఉంది.. ఎక్కడ గోతులున్నాయో తెలుసుకోవాలి. ఏమీ తెలియకుండా అందులో దూకితే బండలు, ముళ్ల కంపలతో ప్రాణాపాయం ఉంటుంది. మద్యం సేవించి నీటిలో ఎట్టి పరిస్థితుల్లో దిగకూడదు. ఈత రాకుంటే అటు వైపే వెళ్లొద్దు.

సూచనలు

హోలీ ఆడటానికి ముందు ముఖానికి మాయిశ్చరైజర్, తలకు నూనె రాసుకోవడం ఉత్తమం. దీని వల్ల రంగులు శరీరానికి సరిగా పట్టుకోవు ఇంకవు. దీంతో రంగులను శుభ్రం చేసుకోవడం చాలా సులభమవుతుంది. చాలా మంది రంగుల్లో వివిధ ఆయిల్స్ కలిపి రాస్తుంటారు. ఈ కారణంగా రంగులను శుభ్రం చేయడానికి ఎక్కువ నీరు అవసరమవుతుంది.

కెమికల్స్ రంగులు వద్దు



రంగుల పండుగ మోజులో కెమికల్స్ కలిపిన కలర్లను వాడితే ప్రమాదం తెచ్చుకున్నట్టే. మనపై చల్లే రంగుల నుంచి వచ్చే పొగ కడుపులోకి పీల్చుకోవడం వల్ల ఊపిరితిత్తుల సమస్యలతో పాటు శ్వాసకోశ వ్యాధులతో ఇబ్బంది పడతారు. రంగులు ఎక్కువగా కంటిలో పడితే శాశ్వత అంధకారం సైతం రావచ్చు. అలాగే స్కిన్ ఎలర్జీకి సైతం గురవుతారు. ప్రకృతి సహజసిద్ధమైన రంగులతో పండగ జరుపుకుని, ఆరోగ్య వంతమైన జీవితం గడపాలి.

– వనం శ్రీనివాస్, ఎండీ సివిల్ సర్జన్

నీటితో ఆటలొద్దు



రంగుల పండుగ పూర్తయిన తర్వాత చాలామంది యువకులు, పెద్దలు స్నానం కోసం చెరువులు, బావులు, జలాశయాల వద్దకు వెళ్తుంటారు. స్నేహితులతో కలిసి రంగుల పండుగ జరుపుకున్న తర్వాత, ఇంటి వద్దనే ఫ్రెష్ కావాలి. జలకాలాట కోసం చెరువులు, బావుల వద్దకు వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు. చెరువులు, కుంటల్లో ఉపాధిహామీ పనుల్లో భాగంగా పూడిక తీత పనులు చేపట్టడం వల్ల పెద్ద పెద్ద గుంతలు ఉండే అవకాశం ఉంది. ఎట్టి పరిస్థితుల్లో సాహసం చేయరాదు. పోలీసులు సైతం ప్రతీచోట నిఘా వేసి ఉంచారు.

– ఎలబోయిన శ్రీనివాస్, సీఐ,జనగామ

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు



కేటీఆర్ సభకు భారీసంఖ్యలో తరలించాలి

- రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తి టౌన్: ఈ నెల 8న మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని తొర్రూరు మండల కేంద్రంలో నిర్వహించే రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ సభకు పాలకుర్తినుంచి భారీ సంఖ్యలో మహిళలను తరలించాలని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మంత్రి మాట్లాడారు. పాలకుర్తినుంచి 4వేల మంది మహిళలను తరలించాలని సూచించారు. తొర్రూరు సభలో మంత్రి కేటీఆర్ చేతులమీదుగా రుణాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో డీఆర్‌డీఓ రాంరెడ్డి, ఆదనపు పీడీ నూరొద్దిన్, ఎంపీపీ నల్లా నాగిరెడ్డి, జెడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాస్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, పాలకుర్తి సర్పంచ్ వీరమానేని యాకాంతరావు, ముస్కు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

హెలిపాడ్, సభాస్థలి పరిశీలన

వరంగల్(పర్వతగిరి): నేటి అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతిమ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని ఏనుగల్‌లో మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్, ఐటీశాఖ మంత్రి కేటీఆర్ రానుండగా సోమవారం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్, కలెక్టర్ గోపి హెలిపాడ్ సభా స్థలం, పార్కింగ్ స్థలాలు, ఇతర ఏర్పాట్లను పరిశీలించారు.

దేశాయిపల్లివాసికి తమిళనాడులో ప్రమాదం..

- ల్యాబ్‌లో యాసిడ్ బాటిల్ పేలి తీవ్రగాయాలు
- ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స



తమిళనాడులో చికిత్స పొందుతున్న రజినీకుమార్

దుగ్గొండి: తమిళనాడు రాష్ట్రంలో ప్రమాదవశాత్తు ల్యాబ్‌లో యాసిడ్ బాటిల్ పేలి వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం దేశాయిపల్లికి చెందిన కందికొండ రజినీకుమార్‌కు తీవ్రగాయాలయ్యాయి. అక్కడే ప్రభుత్వ ఆస్పత్రిలో చావు బతుకుల మధ్యన కొట్టుమిట్టాడుతున్నాడు. వివరాల్లోకి వెళ్తే..రజినీకుమార్ గత కొన్ని సంవత్సరాలుగా తమిళనాడు రాష్ట్రంలోని ట్యుటికోరిన్ జిల్లా కేంద్రంలో ఓ ఫార్మా కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఇదే క్రమంలో ఆదివారం విధులు నిర్వర్తిస్తుండగా యాసిడ్‌తో నిండి ఉన్న గాజు బాటిల్ పేలిపోయింది. దీంతో గాజు ముక్కలు రజినీకుమార్ పొట్టకు గుచ్చుకున్నాయి. యాసిడ్ పొట్ట, కాళ్లు, చేతులపై పడటంతో తీవ్రంగా కాలిపోయాయి. వెంటనే అతన్ని సిబ్బంది ట్యుటికోరన్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు రోగి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని తెలపడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు..

అండగా ఉంటానని ఎమ్మెల్యే పెద్ది హామీ

రజినీకుమార్ ఆరోగ్య పరిస్థితిని గ్రామస్తుల ద్వారా తెలుసుకున్న నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి వెంటనే రజినీకుమార్ కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడారు. అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. ట్యుటికోరన్ ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. తమిళనాడు వైద్యుల అనుమతితో రోగిని తన సొంత ఖర్చులతో విమానంలో హైదరాబాద్‌కు తీసుకువచ్చి ప్రభుత్వ నుంచి ఎల్ఓసీ ద్వారా యశోద ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తామన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యేకు రజినీకుమార్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

గంజాయి విక్రయదారుల అరెస్ట్

- నలుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



అరెస్టు చేసిన నిందితులతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

రామన్నపేట: వరంగల్ బస్టాండ్ సమీపంలో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు దాడులు నిర్వహించి నలుగురిని అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్ రెడ్డి తెలిపారు. ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయ్ విక్రయాలపై అందించిన మేరకు ఇంతేజార్ గంజ్ పోలీసులతో సోమవారం సంయుక్తంగా దాడులు నిర్వహించినట్లు వివరించారు. ఈ సందర్భంగా ఆయన వివరాలు వెల్లడించారు. వరంగల్ బస్టాండ్ సమీపంలో పావురాల రమేశ్, బందెల సాయికుమార్, మహ్మద్‌చాంద్ పాషా, మహ్మద్ సమీర్‌లు గంజాయి విక్రయాలు సాగిస్తున్నారు. ఈ సమాచారం మేరకు దాడులు నిర్వహించిన క్రమంలో విక్రయదారుల నుంచి 500 గ్రాముల గంజాయి, రెండు మొబైల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. అనంతరం వారిని విచారించగా తాము కామన్ ఫ్రెండ్స్ అని రెండు సంవత్సరాల నుంచి గంజాయి తాగడం, అమ్మడం అలవాటుగా ఉందని పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ గంజాయిని సుమంత్, సాయి, విక్కీల నుంచి పలుమార్లు కొనుగోలు చేసినట్లు తెలిపారని వివరించారు. ప్రస్తుతం ఆ ముగ్గురి ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్‌రెడ్డి తెలిపారు. అరెస్టు అయిన వారిలోని పావురాల రమేశ్‌పై వరంగల్, ఖమ్మం, కరీంనగర్, మహబూబాబాద్‌లతో పాటు సికింద్రాబాద్ జీఆర్‌పీ పోలీస్‌స్టేషన్‌లలో 23 కేసులు ఉన్నట్లు తెలిపారు.

హోలీ ఆడుకునేందుకు వెళ్లి వచ్చి..

- నీటి సంపులో పడి బాలుడు మృతి



కుమారుడి మృతదేహంపై పడి రోదిస్తున్న తల్లి



కుశాంత్‌కుమార్ (ఫైల్)

గార్ల: హోలీ ఆడుకునేందుకు వెళ్లివచ్చి ఇంటి ఆవరణలోని నీటి సంపు వద్దకు కాళ్లచేతులు కడుకునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడి బాలుడు మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన గార్ల మండల పరిధిలోని చవిటి తండాలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. చవిటితండాకు చెందిన గుగులోత్ కుశాంత్‌కుమార్(4) తోటి స్నేహితులతో కలిసి హోలీ ఆడుకుని ఇంటికి వచ్చాడు. ఇంటి ఆవరణలోని నీటి సంపువద్దకు కాళ్లు చేతులు శుభ్రం చేసుకునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిసంపులో పడిపోయాడు. బాలుడి తండ్రి వీరన్నకు కిరాణం షాపు ఉండడంతో బిజీగా ఉన్నాడు. రాత్రి పడుకునేముందు కుమారుడు ఇంకా రాలేదని స్నేహితుల వద్దకు వెళ్లి ఆరా తీయగా రాత్రి 8గంటలకే ఇంటికి వచ్చాడని తెలిపారు. అనంతరం తండా అంతా తిరిగి ఇంటికి వచ్చిన తండ్రి నీటి సంపులో చూడగా మునిగిపోయి ఉన్నాడు. కొన ఊపిరితో ఉన్న కుమారుడిని వెంటనే చికిత్స నిమిత్తం మానుకోట ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బాలుడు మృత్యువాత పడ్డాడు. సోమవారం ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి తల్లిదండ్రులకు అప్పగించగా స్వగ్రామానికి తీసుకొచ్చారు. బాలుడిపై పడి తల్లిదండ్రులు రోదించిన తీరు పలువురిని కలిచివేసింది. బాలుడి తండ్రి వీరన్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై రవీందర్ తెలిపారు.

కొండచిలువల కలకలం

- నాలుగింటిని స్వాధీనం చేసుకున్న ఫారెస్ట్ అధికారులు






భారీ కొండచిలువను స్వాధీనం చేసుకున్న ఫారెస్ట్ అధికారులు (ఇన్‌సెట్‌లో) మిగేతా మూడింటిని సంచుల్లో తీసుకెళ్తున్న అధికారులు

రాయపర్తి: మండల కేంద్రంలోని మార్కెట్‌యార్డు వెనుకాల ఉన్న గొల్లకంచ ఎస్సారెస్పీ కాల్వలో నాలుగు కొండ చిలువలు సోమవారం కలకలం రేపాయి. వీటిని గమనించిన రైతులు సర్పంచ్ గారె నర్సయ్యకు సమాచారం అందజేశారు. వెంటనే సర్పంచ్ ఫారెస్ట్ అధికారులకు చేరవేయడంతో ఫారెస్ట్ టెక్నికల్ అసిస్టెంట్ రాజు పాములు ఉన్న ప్రాంతానికి చేరుకున్నారు. ఈ కాల్వలో స్థావరం ఏర్పాటు చేసుకుని ఉన్నట్లు గమనించిన వారు జేసీబీ సాయంతో వాటిని బయటికి తీసి గోనె సంచుల్లో భద్రపరిచారు. వాటిని రిజర్వు ఫారెస్ట్‌లో వదులుతామని ఫారెస్ట్ అధికారి తెలిపారు. ఇందులో రెండు కొండ చిలువలు ఆరు నుంచి ఎనిమిది అడుగులు ఉండగా మరో రెండు పాములు మూడు నుంచి నాలుగు అడుగులు ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గారె నర్సయ్య, ఎంపీటీసీ ఐత రాంచందర్, పంచాయతీ కార్యదర్శి అశోక్ నాయక్, వార్డు సభ్యుడు పోగులకొండ వేణు, రైతులు నల్లబింగి సాయిలు, వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

280 మద్యం బాటిళ్లు పట్టివేత

- నిందితుడి అరెస్ట్



బాటిళ్లను స్వాధీనం చేసుకుని శ్రీకాంత్‌ను అరెస్టు చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

ఖిలా వరంగల్: రైలు మార్గం ద్వారా వరంగల్ మహానగరానికి ఉత్తరాది రాష్ట్రాల నుంచి ఎక్సైజ్ సుంకం చెల్లించకుండా మద్యం తరలిస్తున్న ఓ వ్యక్తిని అరెస్ట్ చేసి 90ఎంఎల్ సైజ్ గల 280 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు మండల ఎక్సైజ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్ తెలిపారు. సోమవారం రాత్రి ఖిలా వరంగల్ మండలం ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కేసు వివరాలను ఆయన వెల్లడించారు. ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ అంజన్‌రావు ఆదేశాల మేరకు రైల్వే మార్గం ద్వారా ఇతర రాష్ట్రాల నుంచి వరంగల్ నగరానికి పెద్ద ఎత్తున మద్యం, ఎండు గంజాయి దిగుమతి అవుతుందని పక్కా సమాచారం అందిందని తెలిపారు. ఈ మేరకు సోమవారం రాత్రి వరంగల్ రైల్వేస్టేషన్‌లో ఎక్సైజ్‌శాఖ అధికారులు నిఘా వేసి ఉంచారు. ఓ వ్యక్తి రైలు దిగి శివనగర్ వైపు వెళ్లే ప్రాంగణానికి చేరుకున్నాడు. ప్రయాణికుల బ్యాగులు ఎక్సైజ్ అధికారులు తనిఖీ చేస్తున్నారు. అందులో వరంగల్ జిల్లా నెక్కొండ మండలం నక్కలగుట్ట తండాకు చెందిన ధారవత్ శ్రీకాంత్ బ్యాగును పరిశీలించగా బ్యాంగులో సుంకం చెల్లించని ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన 280 మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయి. వెంటనే అతన్ని అరెస్ట్ చేసి రూ. 23వేల విలువైన బాటిళ్లను స్వాధీనం చేసుకుని అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై బి.సరళి, హెడ్‌కానిస్టేబుల్ రాజు, కానిస్టేబుళ్లు ఎ.చిరంజీవి, బి.కరుణాకర్, అహ్మద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఇద్దరు మృతి

హసన్‌పర్తి/గీసుకొండ: కడుపునొప్పి భరించలేక ఒకరు, తాగుడుకు బానిసగా మారి జీవితంపై విరక్తి చెంది ఓ ఇద్దరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం ఇద్దరు మృత్యువాత పడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. హసన్‌పర్తి మండల కేంద్రానికి చెందిన శీలం రామరాజు(42) కారు డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొంతకాలంగా రామరాజు కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. చికిత్స చేయించుకున్నా నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది రెండు రోజుల క్రితం పురుగుల మందు తాగాడు. ఎంజీఎంలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల అంగీకారంతో నేత్రాలను ఎల్‌వీ ప్రసాద్ ఆస్పతి సిబ్బంది సేకరించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అదే విధంగా గ్రేటర్ వరంగల్ పరిధిలోని 15వ డివిజన్ మొగిలిచర్లకు చెందిన ఆడెపు రాజు(32) కొంత కాలంగా తాగుడుకు బానిసయ్యాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది సోమవారం ఇంటి వద్ద ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి భారతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ సట్ల రాజు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో ఉపాధ్యాయుడు..



మృతిచెందిన సర్వర్

మహబూబాబాద్ రూరల్ :అనుమానాస్పద స్థితిలో ఉపాధ్యాయుడు మృతి చెందాడు. ఈ సంఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం ఆలస్యంగా వెలుగుచూసింది. టౌన్ ఎస్సై రవి కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని కంకర బోర్డ్ ప్రాంతంలో నివాసం ఉండే ప్రభుత్వ ఉపాధ్యాయుడు సర్వర్ (52) మూడు రోజులుగా ఇంట్లోనే ఉన్నాడు. ఈ నెల 4వ తేదీన పని మనిషి ఇంట్లో పనిచేసేందుకు వెళ్లగా సర్వర్ తనకు ఆరోగ్యం బాగోలేదని ఇంటి బయట వరకు ఊడ్చి వెళ్లిపొమ్మని పనిమనిషితో చెప్పాడు. మూడు రోజుల అనంతరం మళ్లీ సోమవారం ఉదయం పని మనిషి పనిచేసేందుకు వెళ్లగా ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండగా ఆమె స్థానికులు, పోలీసులకు సమాచారం ఇచ్చింది. పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని ఇంటి తలుపులు తెరిచి వెళ్లి చూసేసరికి సర్వర్ మృతి చెంది ఉన్నాడు. మృతుడి సోదరుడు యాకుబ్ జాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. సర్వర్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై రవి తెలిపారు. సర్వర్ శనిగపురం ఎంపీపీఎస్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. కుటుంబ కలహాలతో మృతుడి భార్య, కుమారుడు, కుమార్తె కొంత కాలంగా ఆయనకు దూరంగా ఉంటున్నారు.

ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తాపడి..



సిద్దిరాములు(ఫైల్)

బచ్చన్నపేట: వ్యవసాయ బావుల వద్ద శిథిలావస్థలో ఉన్న దేవతల గుడిని మరమ్మతులు చేయించేందుకు ఇటుక తీసుకురావడానికి వెళ్తూ ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తాపడి గొడుగు సిద్దిరాములు(48) మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని కొడవటూర్ సమీపంలో జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం...సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం మర్మాముల శివారు గ్రామమైన బంజేరుకు చెందిన సిద్దిరాములు వ్యవసాయ బావి వద్ద అమ్మవారి దేవాలయం ఉంది. మరమ్మతులు చేపించేందుకు ఇటుకను తీసుకురావడానికి సొంత ట్రాక్టర్‌లో పెద్దనాన్న కుమారుడు గొడుగు అయిలయ్యతో మండల పరిధిలోని కొడవటూర్‌కు సిద్దిరాములు బయలుదేరాడు. గ్రామ సమీపానికి ట్రాక్టర్ చేరుకోగానే ట్రాక్టర్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న గుంతలో రాములు పడగా అతడిపై ట్రాక్టర్ పడిపోయింది. అయిలయ్య పక్కకు దూకి ప్రాణాలను కాపాడుకున్నాడు. జేసీబీ సాయంతో ట్రాక్టర్‌ను తొలగించి అతన్ని చికిత్స నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం స్వగ్రామంలో అంత్యక్రియలను నిర్వహించారు. మృతునికి భార్య రేణుక, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

గోదావరిలో మృతదేహం లభ్యం



శరత్(ఫైల్)

వాజేడు: మద్యానికి బానిసై మతిస్థిమితం సరిగా లేని ఓ వ్యక్తి నాలుగు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ యువకుడి మృతదేహం గోదావరిలో కనిపించింది. ఈ ఘటన ములుగు జిల్లాలోని వాజేడు మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. వాజేడు ఎస్సై రేఖ అశోక్, బంధువుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పూనెం శరత్(26) 3వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి రాక పోవడంతో మద్యానికి బానిస కావడం, మతి స్థిమితం సరిగా లేక పోవడంతో బంధువుల ఇళ్లలో ఉంటాడని కుటుంబ సభ్యులు భావించారు. తెల్లారినా ఇంటికి రాకపోవడంతో కుంటుంబ సభ్యులు చుట్టు పక్కల వెతకడంతో పాటు బంధువులను అడిగి తెలుసుకున్నారు. అయినా అతని ఆచూకీ లభించలేదు. గోదావరి ఒడ్డున అతని చెప్పులు కనిపించడంతో గోదావరిలో సైతం గాలించగా ఆచూకీ లభించలేదు. కానీ సోమవారం ఉదయం గోదావరిలో శరత్ మృతదేహం కనిపించింది. మృతుడి తల్లిదండ్రులు పూనెం రమణ, కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు. మృతుడికి భార్య ఉంది.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

HOUSE FOR SALE

■ ఉర్సు గుట్ట నుండి కాజీపేట వెళ్ళు 150 ఫీట్ల రోడ్డు ప్రక్కన భట్టుపల్లి SR Prime School కు ఎదురుగా 2 & 3 BHK Independent Houses అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-26778]

■ ములుగురోడ్డు కాకతీయ కెనాల్ కన్నెమూల గణపతి టెంపుల్‌కి దగ్గరలో G+1 తో గల Independent Houses అమ్మకానికి కలవు. సంప్రదించండి: సెల్: 7660008666, 8309035091. [WA-26776]

PLOT FOR SALE

■ హన్మకొండలోని రెడ్డిపురం కెనాలు కట్ట దగ్గర 374 గజాల ప్లాటు అమ్మదానికి ఉంది దగ్గరలో వైర్లు ఉన్నందున కేవలం గజానికి 12,000 రూ॥లు మాత్రమే. సెల్: 9246890951. [W-775786]

FLATS FOR SALE

■ KUDA కాలనీ 100 ఫీట్ల రోడ్డుకి, SPR School కు దగ్గరలో Stilt Plus 5 ఫ్లోర్స్ అపార్ట్‌మెంట్‌లో 2 & 3 BHK Luxury Flats అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-26774]

SERVICES

LOANS

■ హౌసింగ్, బిజినెస్, పర్సనల్, మార్టిగేజ్ & ఉద్యోగస్తులందరికి పర్సనల్ రుణాలు ఏ బ్యాంకులలో అయినా ఇప్పించబడును & IT Returns, GST License చేయబడును. పద్మావతి ఫైనాన్స్-WGL 9618767116 [W-775838]

WANTED

■ GNM Nurses, Pharmacists Computer Operators & Supervisors required for Guardian Hospital, Mulugu X Road, WGL, Cont: 12 to 2pm [WA-0210]

■ Delicious Farms Chicken outlets is hiring for following positions in Warangal. 1) Collection Executive / Delivery Executive, 2) Accounts Executive Relevant experience is mandatory Age 20-35 yrs, Cont: 8106112401. [W-775840]

■ ఇంటి దగ్గర ఉండి మా కంపెనీ బల్బులు ఫిట్‌చేసి ఇవ్వడం ద్వారా నెలకు ఆకర్షణీయమైన జీతం + ఇన్సెంటివ్స్ ఇవ్వబడును. మరిన్ని వివరాలకు సంప్ర : 90300 07628 [L-537]

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము, హైదరాబాద్‌లో పని చేయుటకు లేడీవార్డెన్స్, లేడీసూపర్‌వైజర్స్, నర్సులు, కాంపౌండర్స్, ఆయాలు, భార్యాభర్తలు, వాచ్‌మెన్ కావలెను. Ph : 9391036931 / 9246585901 [HA-10360]

■ Wanted System Operators for Our Branch 100% Knowledge in Photoshop & M.S. Office. Cont: 9963490087 [WA-5288]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్ టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-781924]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారాని ₹3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 9573633520, 9059633520 [M-1190584]

■ సెక్యూరిటీ గార్డ్స్ - 17000/-, సెక్యూరిటీ గార్డ్స్ - 14000/- మరియు ఫీల్డ్ ఆఫీసర్స్ కావలెను. ఏరియా బాలానగర్, బాచుపల్లి, మణికొండ, జీడిమెట్ల, జూబ్లీహిల్స్. Q: 10th Degree, మెట్రో మేనేజ్‌మెంట్ సర్వీసెస్. ఫోన్: 9885657755 [H-792981]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/-రూ॥ అదనపు లైను 60/- రూ॥లు మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ 9010144453
వరంగల్ 9705748198
నర్సంపేట 9010144453
జనగామ 9951602871
మహబూబాబాద్ 9010144453
జయశంకర్ భూపాలపల్లి 9705748198

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.